క్లుప్తంగా

త్వరలో సమస్యలను పరిష్కరిస్తా

బస్తీ దర్శన్‌లో కార్పొరేటర్ పుష్ప



మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్తీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, ఉప కమిషనర్ సురేశ్, ఏఎంఓహెచ్ విజయమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుడితే ఊరంతా పండుగ

నస్తీపూర్‌లో తల్లులను సన్మానించిన సమైక్య సంఘం



తల్లీపిల్లలను సన్మానిస్తున్న మహిళా సమైక్య సంఘం అధ్యక్షురాలు సువర్ణ

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామంలో కొన్నేళ్లుగా ఆడపిల్ల పుడితే ఊరంతా పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇటీవల గ్రామంలో ఎనిమిది మంది మహిళలు ఆడపిల్లలకు జన్మనిచ్చారు. శనివారం తల్లీపిల్లలను మహిళా వెలుగు సమైక్య సంఘం ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు అందజేసి సంఘం అధ్యక్షురాలు సువర్ణ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆడపిల్లల పేర్ల మీద సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఒక్కో అమ్మాయికి రూ.వెయ్యి చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ కల్పన వీవోఏ ప్రవీణ్, మాజీ గ్రూప్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నగేష్ షెట్కార్

నారాయణఖేడ్: ఖేడ్ నియోజక వర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 27 మందికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి సుమారు రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ ఖేడ్‌లో పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, ఖేడ్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నెహ్రూనాయక్, ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, ముఖ్యనాయకులు గంగారెడ్డి, సత్యం, మనోజ్‌పటేల్, సాయిదిగ్వాల్, శంకర్, విఠల్‌రెడ్డి, అంజిరెడ్డి, నారాయణరెడ్డి, సురేష్ నాయక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జొన్నల కొనుగోళ్లు



జొన్నల తూకాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ నాగిశెట్టి, నాయకులు

రాయికోడ్ (అందోల్): రాయికోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నల్లం పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో జొన్నల కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. క్వింటాలు జొన్నలకు రూ. 3,371 ధరను నిర్ణయించారు. నాలుగు రోజుల నుంచి 1200 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు సొసైటీ చైర్మన్ నాగిశెట్టి, కార్యదర్శి మహబూబ్ జానీ తెలిపారు. వర్షాలు పడు తు న్న నేపథ్యంలో జొన్నలు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

గురుకులంలో వేసవి శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో వేసవి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మే 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్ నారాయణ తెలిపారు. శనివారం స్థానిక విద్యార్థులకు బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలోని గురుకులాల్లో అనాథ విద్యార్థులను గుర్తించి చిత్రలేఖనం, వివిధ రకాల అంశాలపై నైపుణ్యం పెంపొందించనున్నట్లు తెలిపారు.

పశువులకు టీకాలు



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న అధికారులు

- గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ చర్యలు
- 30 రోజుల పాటు టీకాల పంపిణీ
- ట్యాగ్‌లు సైతం ఏర్పాటు
- వ్యాధులపై అవగాహన

సంగారెడ్డి జోన్: పశువులలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు నివారణ చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేసే ప్రక్రియను చేపట్టారు. ప్రతి ఏటా వివిధ రకాల వ్యాధుల బారిన పడటంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు..

గాలికుంటు వ్యాధి ఒక పశువు నుంచి మరొక పశువుకు గాలి ద్వారా సంక్రమిస్తుంది. వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు జాతీయ స్థాయిలో ఎన్‌ఏడీసీపీ (నేషనల్ యానిమల్ డీసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం) చేపట్టారు. పశువులకు వ్యాధి రాకుండా ఉండి, పశు సంపదను పెంచాలనే ఉద్దేశంతో చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అఫ్తో వైరస్‌తో వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి సోకితే పశువులలో వేడిమి అధికంగా ఉంటుంది. నోటిలో నాలుక, పెదాలపై చర్మం ఊడిపోయి పుండ్లు అవుతాయి. కాళ్ల గిట్టల మధ్య కూడా పుండ్లు వస్తాయి. అంతే కాకుండా మేత, నీరు తీసుకోకపోవడంతో పాటు నెమరు వేయలేదు. నోటి నుంచి నురగ కారి సరిగా నడవలేకపోతాయి. పాలిచ్చే వాటిలో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. నీరసంగా మారి మృతి చెందే అవకాశాలు ఉంటాయి. ఈ వ్యాధికి చికిత్స లేదని కొన్ని చర్యలు చేపడితే తగ్గించుకొనే అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు.

నెల రోజుల పాటు టీకాలు, ట్యాగ్‌లు..

ఈ నెల 15న ప్రారంభమైన టీకాల పంపిణీ ప్రక్రియ వచ్చే నెల 14 వరకు కొనసాగుతుంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సంత్సరంలో రెండు సార్లు టీకాలను పంపిణీ చేయనున్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి పంపిణీ చేస్తున్నారు. ముందుగానే ప్రణాళికలను సిద్ధం చేసి, వాటి ఆధారంగా గ్రామాలను సందర్శించి టీకాలు వేస్తారు. పశువులకు ట్యాగ్‌లను సైతం వేస్తున్నారు. నాలుగు నెలలు పైబడి ఉన్న లేగదూడలను గుర్తించి వాటికి టీకాలను వేయటంతో పాటు యజమాని వివరాలు సేకరించి భారత్ పశుధాన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

జిల్లాలో పశు వైద్య కేంద్రాల వివరాలు..	
ప్రాథమిక పశు వైద్య కేంద్రాలు	44
పశు వైద్య ఉప కేంద్రాలు	53
ఏరియా పశు వైద్య కేంద్రాలు	5
జిల్లా పశు వైద్య కేంద్రం	1
పాల్గొంటున్న బృందాలు	72
20వ గణన ప్రకారం పశువుల వివరాలు..	
ఆవులు, ఎద్దులు	1,56,282
గేదెలు	1,68,995

టీకాలు వేయించాలి



పశువులలో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల వారీగా నివారణ టీకాలను పంపిణీ చేస్తున్నాం. పశుపోషకులు తప్పనిసరిగా టీకాలను వేయించాలి. ఈ నెల 15నుంచి వచ్చే నెల 14 వరకు నెల రోజుల పాటు కొనసాగుతుంది. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి.

-వసంత కుమారి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, సంగారెడ్డి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎస్పీ పరితోశ్ పంకజ్



సంగారెడ్డి జోన్: జిల్లాలోని వివిధ కుల మతాలకు చెందిన పవిత్ర ప్రార్థన స్థలాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల నేపథ్యంలో దేవాలయాలు, చర్చిలు, మసీదులతో పాటు ఇతర ప్రార్థన స్థలాల్లో 30 రోజుల రికార్డింగ్స్ సామర్థ్యం కలిగిన హై రెజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయడమే కాకుండా జరిగిన నేరాలను ఛేదించడంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, పోస్టులు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

భూముల కబ్జాపై కలెక్టర్‌కు వినతులు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని నంది గామ గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న సుమారు 5 ఎకరాల అసైన్డ్ భూమిని 2020లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కుటుంబానికి చెందిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆరోపించారు. శనివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన భూ భారతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. రుద్రారంలో ఉన్న పెద్ద చెరువు అలుగులను, ఆయకట్టుకు వెళ్లే కాలువలను బాలాజీ బిల్డర్స్ యాజమాన్యం ఆక్రమించిందని సీపీఎం పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతులను పట్టించుకోవడం లేదు..

రామచంద్రాపురం(పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు పశువైద్యాధికారిని రైతులను పట్టించుకోవడం లేదని తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఫిర్యాదు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జన జాతరను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నారాయణఖేడ్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఈ నెల 29న జరిగే పూలే, అంబేడ్కర్ జన జాతర జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ విజ్ఞప్తి చేశారు. మనూరు మండలం హుక్రాన గ్రామంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు. సంగారెడ్డిలో జన జాతర, ఆటా, పాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా అంబేడ్కర్ వాది జేబీ రాజు, బహుజన వాగ్గేయకారులు ఏపూరి సోమన్న, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ నర్సిహులు, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శివలింగానికి పూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

మునిపల్లి(అందోల్): మండల కేంద్రంలోని బుదేరా గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో శనివారం భక్తులు శివలింగానికి పూజలు చేశారు. రాయికోడ్, సదాశివపేట, మునిపల్లి మండలాల్లోని గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి అయ్యప్ప స్వామి, శిరీషా, సంగమేశ్వర్ స్వామి, పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ఐకమత్యంగా ఉంటేనే అందరికీ న్యాయం



సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన నీలం మధు, నాయకులు

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మత్స్యకారులు సభ్యత్వాల విషయంలో కలహాలు లేకుండా కలిసికట్టుగా ముందుకెళ్లాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలు బీసీ- డీ నుంచి బీసీ- ఏ మరియు రాజకీయ, ఉద్యోగ, ఆర్థిక పరమైన విషయాలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ , వివిధ ముదిరాజ్ సంఘ నాయకులతోపాటు నీలం మధు కలిశారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన వేం నరేందర్ రెడ్డి త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ జీవో ఎంఎస్ 98/1964 ప్రకారం ముందుకు వెళ్తే సమస్య పరిష్కారానికి మార్గం సులువు అవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నారాయణ, శంకర్, పాండు, నీలకంఠం, ప్రభాకర్, శ్రీనివాస్, బలరామ్, రమేష్, సంతోష్, శ్రీను, సురేందర్ ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం ర్యాకల్ గ్రామంలో రేణుకాఎల్లమ్మతల్లి జాతర ఉత్సవాలు మూడవ రోజు శనివారం ఘనంగా కొనసాగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, ఖేడ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శంకర్, మాజీ కౌన్సిలర్లు వివేకానంద్, రాజేశ్‌చౌహాన్, హన్మాండ్లు, రామకృష్ణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు.

30న లబ్ధిదారుల ఎంపిక

జిన్నారం (పటాన్‌చెరు): రాజీవ్ యువ వికాసం 2024- 25 పథకానికి దరఖాస్తు చేసుకున్న యువకులకు ఈనెల 30వ తేదీన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు మండల అభివృద్ధి అధికారి అరుణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు బ్యాంకు మేనేజర్లు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. కార్మికులకు గొడ్డలిపెట్టుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో వచ్చే నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సంఘం ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు ఏసు, సిద్ధమ్మ, శకుంతల పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



జహీరాబాద్ టౌన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌనం పాటిస్తున్న దిగ్వాల్ గ్రామస్తులు



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు


జహీరాబాద్ టౌన్: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామ ప్రజలు శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ మందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పర్యాటకులను కాల్చిచంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

కాల్పులు జరపడం హేయమైన చర్య

సదాశివపేట(సంగారెడ్డి): ఉగ్రదాడిని ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తాజోద్దీన్ మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరపడం హేయమైన చర్య అన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రహమాన్, నాయకులు షఫీ, ముస్తాఫా, పాండు, వెంకట్‌గౌడ్, ప్రియాంక, శంకరమ్మ,జ్యోతి, సాధిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మొక్కల పెంపకం వేగవంతం చేయండి



కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని వన నర్సరీలో మొక్కల పెంపకం వేగవంతం చేయాలని ఎంపీడీఓ సత్తయ్య ఆదేశించారు. శనివారం మండలంలోని భీంరా గ్రామంలోని వన నర్సరీని ఆయన ఏపీఓ నర్సిహులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున మొక్కలు విరివిగా పెంచి పంపిణీకి సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సింలు, వన సంరక్షకులు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కొన్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాములు, రాజుగౌడ్, మేరాజ్, యాదగిరి పాల్గొన్నారు.

◆ ఫ్లెక్సీలు తొలగించడం దారుణం

పటాన్‌చెరు టౌన్: వరంగల్ సభ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం దారుణమని బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఫ్లెక్సీలను శుక్రవారం రాత్రి జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించడం అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, యువ నాయకులు చిన్న, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

◆ గ్రాడ్యుయేషన్ వేడుకలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ బస్తీ, చర్చి బస్తీల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసం పూర్తి చేసి ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబాయి, అంగన్వాడీ టీచర్లు ప్రసన్న, భూలక్ష్మి పాల్గొన్నారు.

◆ అన్నదాన కార్యక్రమం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శ్రీగురు విశ్వస్ఫూర్తి పుట్టిన రోజు సందర్భంగా శనివారం రామచంద్రాపురం లింగంపల్లి చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన భక్తులు మాట్లాడుతూ తమ గురువు పుట్టిన రోజు సందర్భంగా పలు చోట్ల అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నీలిమ, మాణిక్ రెడ్డి , శ్రీహరి కిషన్ రెడ్డి, వెంకట నాయుడు, వివేక్, నాగభూషణం పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ పార్టీ జెండావిష్కరణ



సదాశివపేట(సంగారెడ్డి): ప్రజలందరూ మళ్లీ కేసీఆర్‌నే కోరుకుంటున్నారని ఆరవ వార్డు ఇన్‌చార్జి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని 6వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రమేష్, శ్రీశైలం, బాలు, జగదీశ్వర్, సంగమేశ్వర్, నాగరాజు, రాజు, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం

జహీరాబాద్ టౌన్: తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలోని గెస్టు హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు కృష్ణవంశీ, ప్రధాన కార్యదర్శి మొబిన్ సమక్షంలో కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎ.దయాకర్, ప్రధాన కార్యదర్శిగా విఠల్, ఉపాధ్యక్షులుగా గోపాల్, మోహన్, వినోద, కార్యదర్శిగా ఇక్బాల్, జాయింట్ సెక్రటరీగా నాగమణి, పెంటప్ప, కోశాధికారిగా నసీర్, కార్యవర్గ సభ్యులుగా వసీం అలీ, నజీరోద్దీన్, అమీనోద్దీన్, రాజేశ్వర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పనిభారం పెరిగి సమస్యలు ఎదురవుతున్నాయని, ఉద్యోగులంతా సంఘటితమై ముందుకెళ్దామని చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

న్యాల్‌కల్(జహీరాబాద్): అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శనివారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామని ఖాతా వివరాలు, ఓటీపీ వివరాలు చెప్పాలని సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేస్తారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి కూలీల హాజరును కంగ్టి ఎంపీడీఓ సత్తయ్య శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని నాగుర్ (కే)లో శనివారం గులకరాళ్ల కట్టలు కట్టే పనుల్లో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కూలీలకు వేసిన హాజరును ఎంపీడీఓ పరిశీలించారు. గ్రామానికి చెందిన ఖండోబా పంట చేనులో గులకరాళ్ల కట్టల నిర్మాణ పనులు పరిశీలించారు. కొలతల ప్రకారం కట్టలు వేసి గరిష్ఠ వేతనం పొందాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సింలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.